క్లుప్తంగా

వాల్మీకి విగ్రహం ఏర్పాటు


వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: మండలంలోని డేగులపాడు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం నూతన వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విరుపాక్షి హాజరై విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మారయ్య, సర్పంచ్ నీలకంఠ, సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు లాల్ స్వామి,లింగన్న,మల్లికార్జున పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె


పత్తికొండలో కూలిన మట్టి మిద్దె

పత్తికొండ(తుగ్గలి) : తుపాను ప్రభావంతో బుధవారం కురిసిన వర్షానికి పత్తికొండ పట్టణంలో నివాసముంటున్న వలి సాహెబ్ ఇంటి మట్టి మిద్దె కూలిపోయింది. పాత మట్టి మిద్దె ఒక్కసారిగా కూలిపోవడంతో ఇంట్లో వారు భయభ్రాంతులకు గురయ్యారు. సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ


పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దికెర : స్థానిక పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది 65 మందికి సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓ శివకుమార్ బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు సకాలంలో చేపట్టి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆంజనేయులు, సచివాలయ కార్యదర్శి అరుణ కుమారి, కార్యాలయ సిబ్బంది విజయ్, వలి, పంచాయతీ సభ్యులు కిట్టి, లక్ష్మినారాయణ, జంబు పాల్గొన్నారు.

బడులు, గుడుల వద్ద మద్యం షాపులు వద్దు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలో మద్యం దుకాణాలను బడి, గుడులకు దగ్గరలో ఏర్పాటు చేయరాదని, అలా కాదని ఏర్పాటు చేస్తే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ మండల కార్యదర్శి టి. కృష్ణ బుధవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. దుకాణాలను ఇష్టానుసారంగా కేటాయిస్తే సహించేది లేదన్నారు. మండలానికి మంజూరైన మూడు దుకాణాలను ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో ఏర్పాటు చేసేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జొన్న పంటకు గడ్డి మందు పిచికారీ

- బాధిత రైతుకు రూ.6 లక్షలు నష్టం
- ఆస్తిపంచనందుకు కుమారులే ఇలా చేశారని అనుమానం


ఎండిపోయిన పంటను చూపుతున్న బాధితురాలు ఈరమ్మ

ఆలూరు రూరల్: గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ఓ రైతుకు సంబంధించిన జొన్న పంటకు గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో బాధిత రైతు ఈరమ్మకు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే.. మనేకుర్తి గ్రామానికి చెందిన ఈరమ్మకు మండలంలోని హులేబీడు గ్రామ సర్వే నంబర్ 174డిలో 9.82 ఎకరాల భూమి ఉంది. భర్త మరణించడంతో ఈ భూమిని ఆమె సాగు చేసుకుంటోంది. అయితే, ఈరమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ప్రస్తుతం ఆమె తన రెండోకుమారుడు తిమ్మప్ప వద్ద మనేకుర్తి గ్రామంలో ఉంటోంది. భర్త స్వగ్రామం మద్దికెర మండలం అగ్రహారం. అక్కడ 4 ఎకరాల పొలం ఉంది. ఈ భూమిని మొదటి కుమారుడు రమేష్, మూడవ కుమారుడు సతీష్ సాగు చేసుకుంటున్నారు. భర్త ఈరన్న మరణాంతరం హులేబీడులో ఉన్న 9.82 ఎకరాల భూమిని పంచి పెట్టాలని రమేష్, సతీష్ ఒత్తిడి తీసుకొచ్చినా భాగాలు చేయకపోవడంతో వారు కోర్టుకు ఆశ్రయించారు. దీంతో ఈరమ్మ కూడా అగ్రహారంలోని 4 ఎకరాల్లో కూడా భాగాలు చేయాలని కోర్టుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో తన మొదటి, మూడవ కుమారులైన రమేష్, సతీష్‌లే ఓర్వలేక జొన్న పొలానికి గడ్డి మందు పిచికారీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ ఈరమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మాయదారి 'గులాబీ'


ఎండిన పత్తి పంటను చూపుతున్న ఈ రైతు పేరు శేఖన్న. పెద్దహ్యాట గ్రామం. తనకున్న ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.50వేల వరకు ఖర్చు చేశాడు. 'పంట కాయ దశలో ఉండగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో భూమిలో తేమ ఎక్కువైంది. వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో పంట చేతికొస్తుందనుకున్నా.. ఈ సమయంలో గులాబీ రంగు పురుగు సోకింది. పంటను కాపాడుకోవడానికి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. పురుగు తీవ్రతకు పంటంతా ఎండిపోయింద'ని వాపోతున్నాడు.


ఇక్కడ పత్తి పంటను చూపుతున్న రైతు పేరు చిన్నాగౌడ్. బాపురం గ్రామానికి చెందిన ఈయన ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. 'వర్షాలు సకాలంలో రాక ఆలస్యంగా పత్తి వేశా. ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాలకు పొలంలో వర్షపు నీరు భారీగా నిల్వ చేరింది. దీంతో పంట 40 శాతం కుళ్లిపోయింది. సెప్టెంబర్ నెలలో పంట బాగైంది అనుకున్న సమయంలో గులాబీ రంగు పురుగు సోకింది. ప్రారంభంలోనే గుర్తించి అధికారులు చెప్పిన మందులు కొట్టినా పురుగు అదుపులోకి రాక పూత మొత్తం రాలిపోయింది. అక్కడక్కడా ఉన్న కాయల్లోకి పురుగు చేరి తినేసింది. అరకొరగా వచ్చిన పత్తి నాణ్యత లేదని వ్యాపారులు చెబుతున్నారు. భారీగా నష్టపోయా'నని ఆవేదన వ్యక్తం చేశాడు.

- పత్తి పంటకు గులాబీ రంగు పురుగు బెడద
- నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 46 వేల హెక్టార్లలో పంట సాగు
- 10 వేల హెక్టార్లకు ఎర్ర తెగులు
- సీజన్ చివర్లో పంటకు నష్టం కలిగించిన అధిక వర్షాలు


పెద్దహ్యాట వద్ద గులాబీ రంగు పురుగు సోకి ఎండిన పత్తి పంట


ఆలూరు సమీప పత్తి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

ఆలూరు రూరల్: ఖరీఫ్‌లో పత్తి దిగుబడులపై ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలను గులాబీ రంగు (ఎర్ర తెగులు) పురుగు అడియాశలు చేసింది. ఈ ఏడాది అసలే సాగు సాయం అందక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఉన్న రైతాంగాన్ని గులాబీ రంగు పురుగు మరింత ఇబ్బంది పెట్టింది. ఖరీఫ్ సీజన్‌లో ఆలూరు నియోజకవర్గంలో 36 వేల హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం కారణంగా అరకొరగా పత్తి పంట సాగు చేశారు. ఆగస్టు చివర్లో కురిసిన అధిక వర్షాలతో పంట కొంత కుళ్లిపోగా.. కాయదశలో గులాబీ తెగులు సోకింది. దీంతో 10 వేల హెక్టార్లలో పంట నష్టపోయిందని వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా.

ఖరీఫ్‌లో 46 వేల హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 82 వేల హెక్టార్లు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో రైతులు జూలై నెలాఖరు వరకు వేచి చూసి పంటలను అరకొరగా సాగు చేశారు. ప్రధానంగా 46 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. అత్యధికంగా దేవనకొండ మండలంలో 20 వేల హెక్టార్లలో పంట సాగైంది. ఆగస్టు నెలాఖరులో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పొలాల్లో నీరు నిలిచి కుళ్లు రోగం సోకడంతో 5వేల హెక్టార్లలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. సెప్టెంబర్ నెలలో కాయదశలో ఉన్న సమయంలో గులాబీ పురుగు దెబ్బతీసింది. నివారణకు రైతులు వివిధ రకాల పిచికారీ మందులకు భారీగా ఖర్చు చేస్తున్నా అదుపులోకి రావడం లేదు.

పురుగు ఇలా వ్యాపిస్తుంది..

పత్తి పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు గాలి ద్వారా సోకుతుంది. ఇది నాలుగు దశల్లో ఎదుగుతుంది. లార్వా, గుడ్డు, గొంగళి, పురుగు దశ. లార్వా దశలో పూతలో చేరి గుడ్లుగా మారుతాయి. కాయ దశలో గొంగళిగా మారి కాయలోపలికి చేరుతుంది. ఈ దశలో పత్తి కాయను లోపలి నుంచి తింటుంది. కాయ పగిలే సమయంలో పత్తి గింజలోకి చేరుతుంది. దీంతో పత్తి నాణ్యతతో పాటు గింజ నాణ్యత కోల్పోతుంది. ఒక్కసారి ఇది పంటకు సోకితే అదుపు చేయడం చాలా కష్టం. పంట మార్పిడి ద్వారా, వేసవి కాలంలో పొలం దున్ని పంట వేయకుండా వదిలేయడం ద్వారా నివారించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

మండలాల వారీగా పత్తి పంట సాగు వివరాలు..

మండలం	సాగైన పత్తి పంట
ఆలూరు	2 వేల హెక్టార్లు
ఆస్పరి	16 వేలు
చిప్పగిరి	2 వేలు
హాలహర్వి	2 వేలు
హొళగుంద	4 వేలు
దేవనకొండ	20 వేలు

సస్య రక్షణ చర్యలు పాటించాలి


గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. సాయంత్రానికి బుట్టలో ఎన్ని పురుగులు ఉన్నాయో లెక్కవేసి 8 కంటే ఎక్కువ పురుగులు ఉంటే పైరుకు అధిక మొత్తంలో పురుగు సోకినట్లు నిర్ధారించుకోవాలి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలి. వేప నూనె కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనముంటుంది. పంట మార్పిడితో గులాబీ రంగు పురుగును నివారించవచ్చు. – సునీత, ఏడీఏ,ఆలూరు


హొళగుంద వద్ద గులాబీ రంగు పురుగు సోకిన పత్తి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

హాలహర్వి: తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని బాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి తమకు సమాచారం అందించాలని చెప్పారు. వర్షాలు ఇంకా రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉందన్నారు. అనంతరం సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట తహసీల్దార్ నజ్మాబాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, వీఆర్వోలు రాఘవేంద్రస్వామి, ఈరప్ప, లింగన్న, సతీష్ ఉన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి పెండింగ్ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తుండడం వల్ల అన్ని కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ నజ్మాబాను ఉన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఆలూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సబ్ డివిజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు సునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాగు చేసిన పంటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు.

కంది పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు..

కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. పొలంలో నిలిచిన నీటిని బయటికి తోడేయాలి. వర్షం తగ్గిన తర్వాత బూస్టర్ డోస్‌గా ఎకరాకు 20 కేజీల యూరియా పొలంలో చల్లాలి.

పప్పుశనగ..

ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో కొందరు వారం క్రితమే పప్పుశనగ విత్తనం వేశారు. విత్తనం వేయని వారు వారం రోజులు వాయిదా వేసుకోవాలి. విత్తనం వేసిన పొలంలో మొలకలు వచ్చి ఉంటే పొలంలో నిలిచిన నీటిని బయటికి పంపించాలి. వారం తర్వాత 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పంటపై పిచికారీ చేయాలి. వేరు కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పత్తి పంట..

పత్తి పంట మూడవ దఫా కోత దశలో ఉంది. పొలంలో నిలిచిన వర్షపు నీరు బయటికి పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే పంట నిలదొక్కవడానికి, కాయ కుళ్లును నివారించేందుకు యూరియా 20 ఒక లీటరు నీటిలో లేదా ఫార్ములా-4ను 5 గ్రాములు ఒక లీటరు నీటిలో లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి.


కొర్ర,సజ్జ:

ఈ పంటలు ప్రస్తుతం కోత దశలో ఉన్నాయి. ప్రస్తుం వర్షాలు కురుస్తున్నందున రెండు మూడు వారాలు వాయిదా కోత వేసుకోవాలి.

గ్రామాల్లోనే విధులు నిర్వహించండి



కల్లెవంక వాగు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

ఆలూరు: తుపాన్ వల్ల కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచించాలని, వీఆర్వోలు గ్రామ పంచాయతీల్లోనే ఉంటూ విధులు నిర్వహించాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆదేశించారు.స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలూరు నుంచి చిప్పగిరి మండలానికి వెళ్లే రహదారిలో ఉన్న కల్లె వంక వాగు ఉప్పొంగే అవకాశం ఉండడంతో అక్కడ వీఆర్వో, ఇద్దరు వీఆర్‌ఏలను బందోబస్తుగా నియమించామన్నారు. పంట ఉత్పత్తులు వర్షానికి తడవకుండా భద్ర పరుచుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.


మాళమల్లేశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా నంది విగ్రహం నెలకొన్న చిన్న కొండ

రాళ్లు.. అపు'రూపాలు'

దేవరగట్టు కొండలోని పెద్ద రాళ్లు వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్నాయి. మాళ మల్లేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న చిన్న కొండలో బసవన్న రూపంలో రాతిగుండ్లు ఒకదానిపై ఒకటి ఉండి చెక్కినట్టుగా ఏర్పడిన సహజ సిద్ధ రాళ్లను చూసి భక్తులు ఆశ్చర్యచకితులవుతున్నారు. ముఖ్యంగా ఆలయం ఎదురుగా సహజసిద్ధంగా నంది విగ్రహంలా ఉండటంతో స్వామి వారి వాహనం నెలకొన్న కొండగా పిలుచుకుంటున్నారు. పలువురు భక్తులు పూజలు చేస్తున్నారు. – హొళగుంద


దేవరగట్టు కొండలో నంది ఆకారంలో ఉన్న బండరాళ్లు

22న పత్తికొండలో జాబ్‌మేళా

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉదయం 9గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మాధురి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7, 10వ తరగతి, ఇంటర్, ఏదేని డిగ్రీ చదివి 18 – 45 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చన్నారు. ఫ్యూషన్ ఫైనాన్స్, బీఎంఎస్ సెక్యూరిటీ సర్వీసెస్, నవ భారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, రెజ్యూమ్, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 9014588552 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి శిక్షణ

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచ్‌తోపాటు ఇద్దరు వార్డు సభ్యులు హాజరయ్యేలా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించామన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమయ్యే అంశాల గురించి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన ఉండాలి

మద్దికెర : పంటల సాగులో ఎరువుల వాడకం, పురుగు మందు మోతాదు, పిచికారీ విషయంలో రైతులకు అవగాహన ఉండాలని ఏఓ రవి తెలిపారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటలకు సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు


స్వామి వారి షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామంలో వెలసిన దస్తగిరయ్య స్వామి గ్యార్మీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారి షంషీర్‌ను గుర్రంపై ఉంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దర్గాలో స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నూతన మద్యం షాపులు ప్రారంభం

దేవనకొండ: మండలంలో మూడు నూతన మద్యం షాపులు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో రెండు, తెర్నెకల్ గ్రామంలో ఒకటి చొప్పున మొత్తం మూడు మద్యం షాపులను యజమానులు పూజలు చేసి ప్రారంభించారు.

నేటి నుంచి దస్తగిరయ్య స్వామి ఉరుసు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలోని 2వ వార్డులోని వెలసిన పెద్ద దస్తగిరయ్యస్వామి దర్గాలో గురువారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు బుధవారం తెలిపారు. గురువారం గంధం, 18న ఉరుసు, 19న కిస్తీ ఉంటుందని, అలాగే అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం మండలంలోని కోయిలకొండ గ్రామంలో అంతర్‌రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తామన్నారు. పాల్గొనే వారు రూ. 500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9493686207, 6300364569 నంబర్లలె సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


బోయబొంతిరాళ్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పోతుగల్లు, పందిర్లపల్లె, లానీమాన్‌పల్లె, బోయబొంతిరాళ్ల గ్రామాల్లో ఎంపీడీఓ మోహన్‌కుమార్, సర్పంచ్ రవిమోహన్ ఆధ్వర్యంలో సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ జాకీర్‌హుసేన్, ఏపీఓ నాగ సులోచన, సోమలింగడు, మోహన్, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి, కలుగొట్ల, కృష్ణాపురం, వెల్దుర్తిలో పలు అభివృద్ధి పనులకు ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు.

ఆస్పరి: మండలంలోని కారుమంచి, కై రుప్పల, అట్టెకల్లు గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు ఎంపీడీఓ గీతావాణి, సర్పంచులు భూమి పూజ చేశారు.

తుగ్గలి : ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎద్దులదొడ్డి, పై చింతలకొండ, దిగువ చింతలకొండ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ వీరేష్, నాయకులు తిరుపాల్‌నాయుడు, శ్రీనివాసులు, మోహన్, శ్రీరాములు పాల్గొన్నారు.

హాలహర్వి: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సద్దాం హుసేన్, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్ స్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి!


రాతన వద్ద గుంతలు పడిన రోడ్డు


ఎర్రగుడి వద్ద గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి


ఎద్దులదొడ్డి-రాంపల్లి ఎక్స్ మధ్య అధ్వానంగా రోడ్డు

తుగ్గలి : మండలంలో పలు రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకునే నాథుడే లేడు. ఆదోని–గుత్తి ప్రధాన రహదారి గుంతలమయంగా మారి అధ్వానస్థితికి చేరింది. మార్గమధ్యలో అడగడుగునా రోడ్డుపై గుంతలు పడి వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. జీ.ఎర్రగుడి నుంచి గుత్తికి వెళ్లే దారి మరీ దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే ఎద్దులదొడ్డి నుంచి రాంపల్లి ఎక్స్‌రోడ్డు వెళ్లేదారిలో రోడ్డు గుంతలు పడిపోయింది. గతంలో రోడ్లపై కొద్దిపాటి గుంత పడితేనే గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు అడుగుకో గుంత..గజానికో గొయ్యి అన్న చందంగా మారినా కిక్కురుమనకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారులు రోడ్ల మరమ్మతులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కనీస మరమ్మతులైనా చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నాన్‌టీచింగ్ పోస్టులకు 90 దరఖాస్తులు

మద్దికెర : స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 2 నాన్ టీచింగ్ పోస్టులకు 45, ఆదర్శ పాఠశాలలో 3 నాన్ టీచింగ్ పోస్టులకు 45 మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయని ఎంఈఓ రంగస్వామి బుధవారం తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారులకు పంపుతామని, ఎంపికై న అభ్యర్థుల జాబితాను జిల్లా అధికారులు ప్రకటిస్తారని చెప్పారు.